**"ఏవండోయ్ మా తమ్ముడొచ్చాడు! అయ్యయ్యో మా తమ్ముడొచ్చాడండీ! ఆహాహా, మా తమ్ముడొచ్చాడు. బండి దిగ్గానే వాళ్ళ ఇంటికైనా పోకుండా స్టేషన్ నుంచే మనింటికి ఫోన్ చేశాడండీ! అబ్బా నా కడుపు నిండిపోయింది. నేవింక అన్నం తినలేనండీ....నిద్రపోలేనండీ.... నిలబడలేనండీ."**

భోజనాలు చేస్తుండగా ఫోనొస్తే హాల్లోకి పోయి మాట్లాడి తిరిగొచ్చిన శారద కథాకళి చెయ్యడం చూసి శర్మ ఆశ్చర్యపోయాడు. శారద తమ్ముళ్ళు, తల్లితండ్రులంతా ఈ వూళ్ళోనే ఉన్నారుకదా. ఎవరీ బండి దిగే తమ్ముడు?

"ఎవరే?" అని విచిత్రంగా అడిగాడు.

"అయ్యో-మర్చిపోయారా? అదేనండీ. మా ఒరియా తమ్ముడు. చక్రపాణి గుర్తులేదూ? మనం భువనేశ్వరం నుంచి వాల్తేరొస్తున్న బండిలో మన ఎదురు సీట్లో కూర్చున్నాడుగా? మన బాబు ఒరియా మాటాడ్డం చూసి గొప్పముచ్చటపడిపోయి నాతో పరిచయం చేసుకున్నాడు కదండీ? చిన్న కుర్రాడండీ పాపం. ఉత్కళ యూనివర్శిటీలో రిసెర్చి చేస్తున్నాడు. వాళ్ళ అమ్మ, నాన్న ఉండేది ఈ వూళ్ళోనే! గుర్తుకొచ్చాడా?"

ఒచ్చాడుగాని అతనొస్తున్నాడని భార్య భోజనం మానేసి లేచిపోవడం శర్మకు కష్టమనిపించింది. అసలే తినేవి నాలుగు మెతుకులు. అవికూడా తిననీయకుండా ఈ ఒరియా తమ్ముడొచ్చాడని శర్మకూడా చేతులు కడిగేశాడు.

భర్త భోజనం నుంచి సగంలో లేచిపోవడం కూడా గుర్తించే ధ్యాసలో లేదు శారద. ఒకటే హడావుడి. మామూలుగా ఆదివారం మధ్యాహ్నం భోజనాలయ్యాకా కాసేపు నిద్రపోతుంది. ఆదివారమే కాదు సందుదొరికినప్పుడంతా నిద్రపోవడం ఆవిడ హాబీ. కానీ ఇంకెక్కడి నిద్ర? తమ్ముడొస్తున్నాడు.

గబగబా ఇల్లు సర్దేసింది. స్నానం చేసుకుంది. తనకు చాలా అందంగా నప్పుతుందని చక్రపాణి మెచ్చుకున్న లేత గులాబి రంగు చీర కట్టుకుంది. అతనికి నచ్చిన ఫలహారాలు చేసింది.

అతని రాకకోసం చాలా ఆత్రంగా ఎదురు చూసింది. బడినుంచి తిరిగొచ్చిన బాబుకి ముస్తాబుచేసి రాబోయే అంకుల్ గురించి చెప్పింది. వాడికి కూడా ఆ అంకులెవరో వెంటనే గుర్తు రానందుకు ఒకటి అంటించింది.

చక్రపాణి వచ్చాడు.

పలకరింపులు, నవ్వులు, అరుపులతో హాలు నిండిపోయింది.

ఏడాది తరువాత కలిసిన పాణి, శారద ఒకరినొకరు చూసుకొని చాలా తత్తరపడిపోయారు.

# 'మధురం'

# ఆడుకునే ఆడది

"ఏవండీ బాగున్నారా పాణిగారూ?" అని శారద అడిగింది తమ్ముడ్ని.

ఆ తమ్ముడు కొంతసేపు మూతిబిగించుకున్నాడు.

"ఎందుకండీ కోపంగా వున్నారు పాణిగారూ?" మళ్ళీ అడిగింది తమ్ముడ్ని.

"మీతో మాటాడను పొండి శారదగారూ!" అన్నాడు తమ్ముడు.

"ఏం?" అని మధ్యలో జోక్యం చేసుకున్నాడు వెర్రిబాగుల శర్మ.

"నా లేటెస్ట్ ఉత్తరానికి ఆవిడ ఎంత చిన్న సమాధానం రాశారో తెలుసా? జస్ట్ సిక్స్ పేజెస్‌తో ముగించారు-" అని బుంగమూతి పెట్టాడు తమ్ముడు.

తమ్ముడి అలకకు శారద ఉబ్బితబ్బిబ్బైపోయి ఓరకంట చూసి చిరునవ్వు నవ్వింది.

అంతే! పాణి కోపం పటాపంచలైపోయింది.

ఇక అపరిమితమైన కబుర్లు. భోజనాలైనంతసేపూ కబుర్లు.

తరవాత ఇక రాత్రంతా కబుర్లే.

శర్మకి నిద్ర వస్తోందన్నా శారద విడవలేదు. అతను నిద్రపోతే వాళ్ళిద్దరే హాయిగా మాటలాడుకోవడం చూసేవాళ్ళకు బావుండదు కాబట్టి - శర్మకి టీ యిచ్చి, శర్మ చేత గోడకుర్చీ వేయించి, శర్మ మొహాన నీళ్ళు కొట్టి - పేకలాడుకున్నారు జోకులాడుకున్నారు— మధ్యలో బాబుగాడు లేచి ఒంటేలుకి పేచీ పెడితే శర్మ లేచి తీసుకెళ్ళాడు. శర్మే బాబుని మళ్ళీ పడుకోబెట్టాడు. శారద మాత్రం నిరవధికంగా ఆ తమ్ముడి కోరికమీద పాటలు పాడుతూనే వుంది. "కభీ అల్విదనా కహనా...." అంటూ.

ఉదయాన శర్మ తన కారులో పాణిని తీసుకుపోయి డాబా గార్డెన్స్‌లో దించినప్పుడు ఇంటివరకూ రానక్కర్లేదు, కొత్త దూరంగా కారు నిలపమన్నాడు పాణి.

"ఎందుకు? ఇంట్లో దింపేస్తా" నన్నాడు శర్మ అమాయకంగా.

"ఒద్దు సార్. మీకు తెలియదు. మా

అమ్మ అదో మోస్తరు. నేను ఎక్కువగా మీ ఫ్యామిలీతో ఎటాచ్డ్‌గా ఉండటం ఆవిడకి నచ్చదు" అని నవ్వుతూ సమాధానం చెప్పి, కారు దిగిపోయాడు పాణి.

ప్రతిఏడూ సెలవులకని వచ్చిన కొడుకు ఇంట్లో క్షణం ఉండకుండా ఎప్పుడూ శర్మ కుటుంబంతో సినిమాలు, భోజనాలు, పడకలు సైతం ప్రోగ్రాంలు వేసుకునే పద్ధతి ఆ తల్లికి నచ్చకపోవడం చాలా న్యాయమని శర్మకి తెలియదు. శారదకు తెలిసి, అలవోకగా నవ్వుకుంటుంది.

పాణివచ్చిన వారంరోజులవరకూ ఊపిరి తిరగని షికార్లు. చిన్నకుర్రాడు కదా పాపం పాణి! కాబట్టి అతన్ని తీసుకుపోయి బీచి చూపుతుంది శారద. బజార్లు తిప్పుతుంది. హిందీ సినిమాలకు తీసుకుపోతుంది.

"తెలుగువి చూడొచ్చు కదా. అందరికీ అర్థమౌతుంది" అని శర్మ అడిగితే — "అర్థం కాకపోతేనే కదా. ఒకరి కొకరు అర్థాలు చెప్పుకోవడంకోసం ఒకరిపైనొకరు ఒరుసుకుని కూర్చునే అవకాశం దొరుకుతుంది!" అని వాళ్ళిద్దర్లో ఎవరూ శర్మతో అనలేదు.

"ఏక్ నహా పెహరీ" బాగుంది అంది శారద.

"ఇదే అరవంలో అపూర్వ రాగంగళ్" అన్నాడు పాణి.

ఇంటర్వెల్‌లో "మీరిప్పించిన కూల్ డ్రింకుతో నా గొంతు పట్టేసిందిబాబూ...." అని కులికింది అక్కయ్య మురిపెంగా.

"మీ రిప్పించిన మీఠా కిల్లీతో నా పెదాలెలా పండిపోయాయో చూడండి." అని పలికాడు తమ్ముడు చిలిపిగా.

"కారు తీసుకొస్తాను, వుండండి" అని శర్మ వెళ్ళి కారు తిప్పుకొచ్చేసరికి వాళ్ళిద్దరూ కనబడలేదు. కాసేపు శర్మ కంగారుపడినప్పటికీ— తన కారు రోడ్డుకి అడ్డంగా వుందని, ఇద్దరికీ ఊరుకొత్త కాదనే ధీమాతో ఇంటికి కారు తోలుకుపోయాడు శర్మ.

అతను భోజనం చేసి పడుకోబోతుండగా ఆటో దిగి శారద, పాణి వచ్చారు. వస్తూనే శర్మ అడగాలనుకున్న ప్రశ్నలన్నీ శారదే అడిగేసింది.

"ఏమైపోయారండీ? అసలు మీరేమన్నారు? కార్లో వస్తాను, మీరు ఆటోలో వెళ్ళిపోండి అన్నారు కదూ? పాపం పాణికి అనవసరంగా శ్రమ కదండీ? మనిద్దరం కార్లో వచ్చేస్తే అతను అట్నుంచటే ఆటోలో ఇంటికి వెళ్ళిపోవాలనుకున్నాడు. ఇప్పుడు నన్ను దింపడంకోసం మనింటి వరకూ వచ్చాడు. పాపం ఈ రాత్రప్పుడు మీ యింటికేం వెళ్తారు పాణిగారూ? ఇక్కడే భోజనం చెయ్యండి....!"

పడవంత కారుండగా తను వాళ్ళను ఆటోలో వెళ్ళిపొమ్మని ఎందుకన్నాడని వాళ్ళు ఎలా విన్నారో శర్మకి గింజుకు చచ్చినా అర్థంకాలేదు. కళ్ళు మూసుకు పడుకుండిపోయాడు.

అలా కళ్ళు మూసుకోవడం అతనికి కొత్త కాదు.

అతను అన్నిటికీ దేవుడిలాగా కళ్ళు మూసుకుంటాడు.

అన్నిటికీ దేవుడిలాగా నోరు మూసుకుంటాడు.

దేవుడిలాగా చేతులు ముడుచుకొని కూర్చుంటాడు- అన్నిటికీ!

దేవుడిలాగా కనికరిస్తాడు అందరీన్ని.

అందుకే తరచూ శారద అంటూ వుంటుంది. "మా వారు దేవుడు" అని.



## సుభాషితాలు

### యాదుల లౌకికజ్ఞాన సంపత్తి

ప్రేమ గుడ్డిదే కావచ్చు— అసూయకు మాత్రం చూపులు వాడి.

* * *

నన్ను కాస్తంత తక్కువ మోతాదులో ప్రేమించు— కానీ ఎక్కువకాలం పాటు ప్రేమించు.

* * *

మానవజాతిని ప్రేమించడం సులభం. కానీ సాటి మనిషిని ప్రేమించడం కష్టం.

* * *

ఒక ముసలాయన యువతిని పెళ్ళాడితే ఆయన యువకు డౌతాడు.

* * *

ఒక యువకుడు పెళ్ళిచేసుకుంటే అతడు తన తల్లికి విడాకులిస్తున్నాడన్న మాట.

* * *

పిల్లలు నోటితో చెప్పని విషయాలను తల్లి అర్థం చేసుకొంటుంది.

* * *

నూరుమంది ఉపాధ్యాయులు నెరవేర్చ లేని పనిని ఒక తల్లి సాధించగలదు.

* * *

మాటలను తూచాలి. లెక్కపెట్టరాదు.

* * *

సత్యానికి విలువలు తగిలించకు. అలా చేస్తే సత్యమే తరుగుపడుతుంది.

* * *

దోషం అంటని స్నేహం కోరేవారు స్నేహం అంటని వారౌతారు.

సేకరణ:

—శ్రీమతి-వేదం సుశీలాశేఖరమ్.

తిరుపతి

## 2

పాణి రెండు పూటలా శర్మ ఇంట్లోనే భోజనం.

శారదకి సాయంగా బజార్లకి, బేంకులకి వెళ్తాడు.

గుళ్ళకి, గోపురాలకి పోతాడు.

ఆవిడ ఒక్కత్తీ ఎక్కడకూ వెళ్ళదు.

అలా ఒంటరిగా మగతోడులేనిదే ఆడది బయటికి వెళ్ళడం అనాచారమని ఆవిడ గట్టి నమ్మకం. ఆవిడ చాలా ఆచారంగల కుటుంబంలో పుట్టింది.

కానీ ఆడతోడుమీద పెద్ద ఆసక్తి లేదు శారదకి. ఆడవాళ్ళకు ఆవిడంటే పడదని కూడా ఆవిడకి తెలుసు. ఎందుకంటే, ఆ ఆడవాళ్ళయొక్క మగవాళ్ళను ఆవిడఎప్పుడూ ఆకర్షిస్తూ ఉంటుందని ఆ ఆడవాళ్ళకి తెలుసునని శారదకూ తెలుసు.

"ఎవరండీ ఈ పాణి?" అని ఎవరైనా అడిగితే-

"మావారికి బెస్టు ఫ్రెండు" అనిచెప్తుంది శారద.

"మరి మీవారు లేని సమయాల్లో నే మీ యింట్లో ఎక్కువ గడుపుతాడేం?"

"ఒక గంటైనా మీ వారు పనిచేసే ఆఫీసుకి పోడేం?"

"మీతో ఫొటోలు తీసుకుంటాడు. మీవారితో తీసుకోడేం?"

"మీ మాటలు, నవ్వులు, కబుర్లు టేప్ రికార్డు చేసుకుంటాడు. మీవారిని మాట్లాడమనడేం?"

"మీకే ఉత్తరాలు రాస్తాడు. మీవారికి రాయడేం?"

—అని ఆవిడ్ని ఇంతవరకూ ఎవరూ అడగలేదు. అడగరు!

అందుకు కారణం— అతను చాలా చిన్నవాడని శారద చెప్తుంది.

ఆవిడకన్నా అతను కనీసం పన్నెండు రోజులు చిన్నవాడని శారద. కాదు పదకొండు రోజులే అని పాణి-తరుచూ వాదించుకుంటారు. ఎంత చిన్నయితేనేం, చిన్నచిన్నే కాబట్టి- అతను తనకు తమ్ముడిలాటివాడని అంటుంది శారద.

ఇక్కడ శారదమీద మీకు సదభిప్రాయం ఏర్పడటం కోసం ఆవిడలోని మంచిగుణాలు కొన్ని చెప్పుకుందాం. ఆవిడ నిజానికి చాలా ఉత్తమురాలు. ఆవిడ్ని పద్మినీజాతి స్త్రీ కింద పేర్కొంటాడు ఆవిడ్ని కట్టుకున్న శర్మ. ఆవిడ అందంగా ఆకర్షణీయంగా వుంటుంది. చాలా అందంగా నవ్వగలదు. అలా అన్నిటికీ నవ్వగలదు.

భర్తకు ప్రమోషనొచ్చిందని చెప్తూ ఎలా నవ్వగలదో, అతనికి జ్వరం వచ్చిందని చెప్తూ కూడా అలాగే నవ్వగలదు. నవ్వే ఆడదాన్ని నమ్మకూడదని మీరనుకుంటే అది మీ పాపం!

ఆవిడ్ని నమ్మొచ్చును. ఆవిడ తప్పులు చెయ్యదు. లోకం నిలదీసి ప్రశ్నించే రకమైన తప్పులు చెయ్యడమంటే ఆమెకు భయం. ఆమె చాలా గొప్ప చరిత్ర కలది. ప్రజ్ఞావంతురాలు కూడా. మన అరిచేతుల్లోనే మనకు వైకుంఠసుఖాలు చూపే సమర్థురాలు. అన్నం చూపించి ఆకులు తినిపించగల ప్రతిభ ఆమెది.

సరే మగవారితో స్నేహంగా ఉండటం ఆమె హాబీ! ఐతే? తన భర్తకు తను అపకారం చెయ్యనంతకాలం దర్జాగా బ్రతకొచ్చుననే ధీమా ఆమెకు! ఆ ధీమాని అపార్థం చేసుకుని ఎవరైనా మనసు జార్చుకుంటే— అది తన తప్పెందుకౌతుంది? అలా జార్చుకుని తన చుట్టూ తిరగడం ప్రారంభిస్తే— తన బాధ్యతేముంది? అలా తిరుగుతూ తన చనువు మ్రతిమించి వాడేసుకుంటే— ఆ పాపం తనకెందుకు అంటుతుంది? తనేం చెయ్యలేదుగా తప్పు? తప్పు జరిగితే జరగొచ్చుగాక? తన ప్రయత్నంతో జరగలేదే! తన భర్తకు తను ఏనాటికీ ద్రోహం చెయ్యదు. ఒకవేళ ద్రోహం జరిగితే అది అతని బెస్టుఫ్రెండ్సు చేసిన ద్రోహం కిందికే వస్తుంది తప్ప తన ప్రమేయంలేదు!

తను తామరాకుమీద నీటిబొట్టు!

చెడేవాడు తనకోసం ఖర్చయిపోయే ఒక కన్నీటి బొట్టు! అంతే……!

## 3

అలా తామరాకుమీద నీటి బొట్టులా ఆమె తప్పించుకున్న సంఘటన ఆ మధ్యనే ఒకటి జరిగింది కూడా.

శర్మకు మరో బెస్టు ఫ్రెండు- శర్మతోనే ఉద్యోగం చేస్తున్న ఒక సత్యం తరుచూ ఇంటికి రాకపోకలు - శారదతో పరిచయం, స్నేహం!

"మావారు లేరని మీరేం బిడియపడకండి! మీకు ఖాళీగా వున్నప్పుడంతా మా యింటికి రావచ్చు." అని చాలా ఉత్తమ గృహలక్ష్మిగా శారద అందించిన ఆహ్వానంతో— నాలుగేళ్ళుగా సత్యం వెర్రివెంగళప్పలా శారద చుట్టూ పరిభ్రమించడం ప్రారంభించాడు.

అందరూ ఒక్కలా ఉండరు!

కాలక్షేపం అనుకున్న వాళ్ళకయితే శారదతో పరిచయం మంచి కాలక్షేపమే!

అదో గొప్ప విశేషమనుకుని భ్రమపడే


సత్యంలాంటి వాళ్ళకు ఆమె ఒక జీవన్మరణ సమస్య!

అతను ఆఫీసు కూడా ఎగ్గొట్టి. ఇల్లి వాకిలి పట్టించుకోకుండా శర్మ యింట్లో కబుర్లు, షికార్లతో గడుపుతున్న విషయం అతని భార్యకు తెలిసింది. ఆవిడ తిన్నగా పోయి ఊళ్లోనే ఉన్న శారద తల్లిదండ్రులతో మొరపెట్టుకుంది. ఆ తండ్రిగారొచ్చి శారదను చివాట్లు పెట్టారు.

"నాన్సెన్స్! ఆయన్ని నేను రమ్మనడమేమిటి? నాకేం అవసరం? రానీండి చెప్తాను. చెప్పుతీసుకొట్టడతాను" అని తండ్రితో గట్టిగా అంది. సత్యం వచ్చినప్పుడు అలాగే కొట్టినంత పని చేసింది.

ఆవిడ చెయ్యగలదు. ఎందుకంటే ఆవిడకు సత్యం కాకపోతే మరో శివం. ఇంకో సుందరం-కాలక్షేపానికే కదా? కానీ సత్యానికి అలా కాదు!

ఆవిడ స్నేహాన్ని మనసారా ఆరాధించాడు. ఎలాటి లేకి కోరికలకూ తావివ్వకుండా ఆమె సన్నిధానమే తన జన్మకు సాఫల్యమనుకున్నాడు — కొందరుంటారు సన్నాసులు! అలా స్నేహానికీ, మోహానికీ అతీతమైన ఒక పిచ్చిలో. ఉచ్చులో పడిపోయాడు సత్యం.




ఇలాటివి శారదకు బొత్తిగా అర్థం కావు.

అవకాశం ఉన్నంతకాలం స్నేహం చెయ్యడం.

అవకాశం లేదూ? చెరిపేసెయ్.

సత్యాన్ని తన గుమ్మం దరిదాపులకు రావద్దని దబాయించి చెప్పి పంపించి తలుపులు మూసేసింది శారద.

ఏడాదిపాటు పిచ్చివాడిలా తిరిగాడు సత్యం. తన భార్యకు తెలియకుండా ఎవరి కంటా పడకుండా- ఒక్కసారి ఆమెను చూడాలనే ఆరాటంతో ఎన్నో ప్రయత్నాలు చేశాడు. శారద పడనివ్వలేదు. ఆవిడది వజ్ర సంకల్పం.

నాలుగేళ్ళ నుంచి ఆమె నీడను మేడ గట్టుకున్న నిజమైన స్నేహితుడు - ఇప్పుడు హఠాత్తుగా చిన్న అవాంతరం వచ్చిందని ఆమెను వదులుకోవడం చేతకాక గిజగిజలాడిపోయాడు సత్యం. ఆమె కూడా మనసులో తన రాకకోసం ఎదురు చూస్తూనే ఉంటుందని అపోహపడ్డాడు.

ఆమె అదంతామరిచిపోయి.ఇప్పుడు సెలవులకొచ్చిన పాణితో యథేచ్ఛగా, స్వేచ్ఛగా



వుంటుందన్న విషయం సత్యానికి తెలియదు, సత్యాన్ని దూరంగా ఉంచినందువల్ల ఏర్పడిన వ్యామోహపు శూన్యాన్ని భర్తీ చేస్తూ చక్రపాణి మరొక రూపంలో వచ్చాడన్న నిజం సత్యానికి తెలియనే తెలియదు.

ఒకరోజు........

చక్రపాణి వచ్చిన పదో రోజు.........

ఆ రోజు సత్యం పుట్టిన రోజు.

ఆమెకోసమే తను పుట్టాడనుకున్న పిచ్చి సత్యం—

తెగించి ఆమె యింటికిపోయి తలుపు తట్టాడు.

"ఎవరూ?" అంది ఒరియాలో శారద, తన ఒరియా తమ్ముడనుకుని. తనెవరో చెప్పి తలుపు తియ్యమన్నాడు సత్యం.

"వెళ్ళండి" అంది నిష్కర్షగా. తలుపులు తెరవకుండానే.

బ్రతిమాలాడు. "ఇంట్లో అడుగుపెట్టను ఒక్కసారి మొగం చూసిపోతా"నని ప్రార్థించాడు.

"మా నాన్నకి ఫోన్ చెయ్యమన్నారా?" అని బెదిరించింది లోనుంచి.

అదిరిపోయాడు సత్యం!

బెదిరిపోయి కాదు! శారద అలా తనను బెదిరించగలిగినందుకే అదిరిపోయాడు.

పుట్టిన రోజు గుడికి పోతానని ఇంట్లో చెప్పి ఈమె గుమ్మం ముందు నిల్చుంటే జడిపిస్తుందా? ఆమె ఆహ్వానం మీద నాలుగేళ్ళుగా ఇంటి: కొచ్చినప్పుడల్లా ఎవరి

## విడాకులు

అగ్నిహోత్రుని నాల్గు నేత్రము
లొక్కసారిగ
భగ్గుమన్నాయి!

పితృలోకపు దైవతమ్ములు
అంఘలై తెగ
తడుముకున్నారు!

భావిభారత పెండ్లిచట్టము
రంకె వేస్తూ
అంకె చెరిపింది
ఖడ్గమాలా కాళికాంబా ఖస్సుమంటూ
ఎగిరి దూకింది
అర్థనారీశుడే అదిరీ ఆమెలోంచీ
దుమికి ఉరికాడు.

గొడు గేదె
గొడ్లసాలను
పలుపు త్రెంచుక పారిపోయింది.
కోడిపుంజుకు
పట్టు దొరకక
పెట్ట జారీ బుట్ట దూరింది.
సరి! తనేమో
నూత్న చిత్రం
గగనతలమున రంగులల్లింది!

—విశ్వనాథ పావనిశాస్త్రి

చేసింది ఫోన్లు? తన కోసం తన భార్య ఫోన్ చేస్తే తనను ఇంట్లో పెట్టుకునే లేదని చెప్పింది ఈవిడేనా? శర్మ ఆఫీసు నుంచి ఫోన్ చేసి మాటాడితే— ఇంట్లో ఎవరూ లేరు— తను ఒక్కర్తే వుందని కట్టుకున్న భర్తతోనే బుకాయించింది ఈ యిల్లాలేనా? ఇప్పుడు తనను భయపెడుతోందా? తనవారికి భయపడుతోందని అనుకున్నాడుగానీ, తననే ఇలా భయపెడుతుందని ఊహించలేకపోయాడు సత్యం. ప్రేమించే పిచ్చివాళ్ళు భ్రమపడతారు. భయపడరు!

తలుపు తెరవలేదు శారద.

మరోసారి బ్రతిమాలాడు.

"ఇప్పుడు ఏంటీ?" అంది ఒడ్డి ఇడియంలో తెలుగు మాటాడుతూ.

"నా పుట్టిన రోజు. నిన్ను ఒక్కసారి చూసిపోతాను. ఏమీ మాటాడను. దయచేసి తలుపు తియ్యి" అని వినయంగా కోరాడు.

"మా తమ్ముడొచ్చే వేళయింది వెళ్ళండి" అంది.

ఆ మాటే తలుపు తీసి చెప్పొచ్చు కదా. మొగమైనా కనిపించేది అనుకున్నాడు. చాలాసేపు ఎదురు చూశాడు ఆశతో. "నేను వెళ్ళిపోనా"అని దీనంగా అడిగాడు చివరికి.

"వెళ్ళండి" అని కర్కోటకంగా బదులిచ్చింది శారద తల వంచుకుని వెళ్ళిపోయాడు నేస్తం.

## 4

శారద అబద్ధం చెప్పలేదు.

సత్యం వెళ్ళిన కాస్సేపటికే తమ్ముడు చక్రపాణి వచ్చాడు.

గొంతు వినగానే ఉప్పొంగిపోయి తలుపులు తెరిచింది. నవ్వులు, కేరింతలు, ఆటలు, పాటలు!

శర్మ తొందర తొందరగా వస్తే రెండో ఆట సినిమా "సాగర సంగమం" చూసేందుకు టిక్కెట్లు కూడా తీసుకుని ఎదురు చూస్తున్నారు. అతను చాలా పొద్దుపోయే వరకూ రానందుకు విసుక్కుంది శారద. తొమ్మిది దాటుతూండగా ఇంటికొచ్చాడు శర్మ.

"ఇంత ఆలస్యమేంటండీ?" అని దబాయించింది శారద.

"మన సత్యం లేడూ? ఇదుగో ఈ జంక్షన్‌లోనే బస్సు క్రింద పడి చచ్చిపోయాడు శారదా!"

శారద క్షణంసేపు మౌనం పాటించింది.

"పుట్టిన రోజట. కొత్త బట్టలు కట్టుకుని గుడికని బయలుదేరాడట. వాళ్ళింటి దగ్గర ఎక్కడా గుళ్ళు లేనట్టు మన వీధి కాశికాలయానికొచ్చాడు చూడు! ఔను, అతనీ మధ్య మనింటికి రావడం మానేశాడు— ఏం శారదా?" దిగాలుగా అడిగాడు శర్మ.

కానీ శర్మకు తెలుసు.

## సాహితీ క్విజ్

### (హాస్య రచనలు)

1. హాస్యం, వ్యంగ్యం తొణికిసలాడే ప్రముఖ తెలుగు తొలి నాటకం?
2. తెలుగులో "అపర అరిస్టోఫెన్"గా సాహితీకారులు గౌరవించే ప్రముఖ సాహితీ వైతాళికుడు?
3. హాస్య త్రిమూర్తులు ఎవరు?
4. "గాజు పాలెం గాంధి" నాటిక వ్రాసిన ప్రముఖ హాస్య రచయిత?
5. "ఆషా—మాషీ" పేరిట హాస్య వ్యంగ్య వ్యాసాలు వ్రాసింది?
6. "చలువ మిరియాలు" వ్రాసిన ప్రముఖ రచయిత?
7. "అభినవ వేమన" పద్యాలు వ్రాసిన ప్రముఖ కవి?
8. సినిమాల్లో ప్రముఖ హాస్య సంభాషణా రచయితగా ప్రఖ్యాతి వహించిన ప్రముఖ నాటక రచయిత?
9. "బుడుగు" సృష్టితో హాస్య రచయితగా ప్రముఖస్థానం పొందిన రచయిత?
10. "అగ్‌డిన్‌నాష్" అనే హాస్యకవిని అనుకరిస్తూ అంత్యప్రాసల పద్యాలు వ్రాసిన ప్రముఖ కవి?

—ఎమ్. డి. సౌజన్య

జరిగినదంతా అతనికి తెలుసు.

శారదకు మాత్రం సమాధానం దొరక లేదు.

ఒక్కసారిగా కోపం తెచ్చేసుకుంది.

ఆ కోపం బహుశా గుండెలోని అనేక రకాల ఉద్రేకాల ఒత్తిడికి తట్టుకోలేని చేతగాని కోపం కావచ్చును. బాధకు సమాధానం లేక తనమీద తనే చేసుకునే ఒకరకమైన తిరుగుబాటు కావచ్చును.

"సరదాగా మా తమ్ముడితో నేను కబుర్లు చెప్పుకుంటుంటే మీరు చావు కబురు చెప్తారేమండీ దరిద్రం? ఆ సత్యం మీ తోడ పుట్టాడా, నా తోడ పుట్టాడా? రోజుకి వంద మంది పోతారు ఏక్సిడెంట్లలో! మీరుగాని శవాన్ని ముట్టుకున్నారే(ఏటి? తొందరగా తలకి స్నానం చేసి తగలడండి! సినిమాకి టైమైపోతోంది...."

అనేసిందిగానీ 'శవం' అంటున్నప్పుడు శారద గొంతు కాస్త వణికింది. జాలితో కాదు. భయంతో! ఎక్కడ సత్యం దెయ్యమై తనని పట్టుకుంటాడో అని భయపడింది పిచ్చితల్లి.

స్నానం చెయ్యడానికి వెళ్ళబోతున్న శర్మ యాదాలాపంగా అన్నాడు : "సత్యం నా తోడపుట్టలేదుగానీ, చక్రపాణి మాత్రం నీతోడ పుట్టాడా?"

ఆ మాటతో శారద తాచుపాములా లేచి పోయింది. "చాలింక ఆపండి! పాణికి, సత్యానికి పోలుస్తారేం? పాణి మనింటి కొస్తే ఎవరూ తప్పు పట్టరు. పైగా పాణికి పెళ్ళి కూడా కాలేదాయె. సత్యం అలా కాదే! అతనితో చాలా న్యూసెన్సు."

"న్యూసెన్సు...." అన్న ఆ ఒక్కమాట వెనక శారదకు మాత్రమే తెలిసిన అర్థాలు లక్ష వున్నాయి.

సత్యం ఆరాధిస్తాడు.
పాణి ఆడుకుంటాడు.
సత్యం ఏడుస్తాడు.
పాణి నవ్వుతాడు.
సత్యం పెద్దవాడు.
పాణి కుర్రవాడు.

సత్యంతో అంతా రహస్యమే!

పాణితో పట్టపగలు తలుపులు బిగించుకున్నా ఏ తప్పూ జరగదు. ఎవరూ తప్పు పట్టరు! వయసులో ఉన్న కుర్రాడితో తలుపులు బిగించుకు గడిపిన థ్రిల్ కూడా దక్కుతుంది

పైగా—

సత్యాన్ని కలవకూడదని శారద తల్లిదండ్రులు హెచ్చరించారు.

పాణిని కలవకూడదని ఎవరూ హెచ్చ






## గుండెల్ని కలిపే మంత్రం

మా యిల్లు బహు ప్రాచీనం—
మా ముత్తాతలు నిర్మించారు
మనువు మాంధాతల నాడు.

అవగతం కాదు స్పష్టంగా
మా తాతయ్య మాట నాకూ
నా మాట నా సోదరులకూ.

ఒకరి దాకా ఎందుకు?
నవ్వుతారు నా దారాసుతులే
నా మాట వింతగా కనిపించి.

మునిమాపువేళ వచ్చాడు
ఒక ఆగంతువు; అతడన్నాడు
మా యింట్లో నా మాట భిన్నమట!

తల కొట్టినట్లయింది నాకు
హంస ఎగిరిపోయినట్లనిపించింది
వడవడ నవనాడులా వణికిపోగా.

లెక్కలేనన్ని తరాలవారు
కనుమూసి తెరిచిన మా యింట్లో
నా భాష తెలీదా నలుగురికీ?

మా మాటలు మాలో మాకు
వినిపించవచ్చు గ్రీకు లాటిన్లులా
అంతమాత్రాన మరీ భిన్నమా నా భాష?

రకరకాల మాటలు కలిస్తే
రంగు రంగుల భావాలు మెరిస్తే
వెలుగుతుంది వింత సోయగం.

అంగాలు ముడుచుకున్న కూర్మం
భావాలు దాచుకున్న పదం;
పదం ఇక్షువయితే భావం రసం.

మా ముత్తాతల ఈ ప్రాచీన గేహం
కావాలి నిసర్గ సుందరా రామం
నా పౌత్రులకూ దౌహిత్రులకూ.

తెలుసుకోడానికి బిగించాను నడుము
ముత్తాతల మాట తీరునే కాదు
సహోదరుల మాటలు సైతం.

మాటలు కొన్ని వింతగా వినిపించినా
మాటల్లోని మల్లెలు సౌరభాలు
పరవశింపజేశాయి నా మనస్సుని.

మాటల్లోని వింత మాయమయింది
ప్రతి మాటా నా మాటగా తోచింది
మధుర మధురంగా వినిపించింది.

వాడుకమాట తీరు సెలయేటి నీరు
నా పౌత్రులూ దౌహిత్రులూ రేపు
ఎలా వ్యవహరిస్తారో తెలీదు నాకు.

అయినా ఒకటి మాత్రం నాకు తెలుసు
మా మాటల తీరు ఎలా ఉన్నా
మేమంతా ఒక తాను గుడ్డలం.

మా మాటలు భిన్నంగా ఉండవచ్చు
అంత మాత్రాన పరాయివారం కాము
మేమంతా ఒక గూటి పక్షులం.

అందుకే ప్రాచీనమైనా మా యిల్లు
కలకల లాడుతూ కనిపిస్తుంది
గతంలోనే కాదు ఆగతంలోనూ.

ఒకరిమాట నొకరు తెలుసుకుంటూ
సమైక్యంగా మనుగడ సాగిద్దాం
సుందర నందనాలు సృష్టించుకుందాం.

లేదు లేదు మాటను మించిన మంత్రం
సర్వజగతికీ అది ప్రేమపాత్రం;
గుండెల్ని కలిపే మాట పరమ పవిత్రం!

—చల్లా రాధాకృష్ణశర్మ

రించలేదుగా?

ఔను!

తాను ఇతరుల హెచ్చరికలమీద ఆధారపడి బ్రతుకుతోంది. తనను తాను పాణి గూర్చి హెచ్చరించుకోవలసిన అవసరం ఇప్పుడేమొచ్చింది? పాణి గూర్చి ఎవరూ సందేహించడం లేదే! 'జయం' అంటూ ఫోను మోగింది.

బాత్రూమ్‌కి వెళ్ళబోతున్న శర్మ మాటాడి ఫోను పెట్టాడు.

మళ్ళా మోగింది.

మళ్ళా మాట్లాడి ఫోను పెట్టాడు.

"ఎవరు?" అడిగింది శారద.

"ఏం పాణీ? ఈ రోజు మీ యింట్లో ఏదో పండగట, భోజనానికి నీకోసం ఎదురు చూస్తున్నారు. ఈ ఒక్కపూటకి తప్పక ఇంటికొచ్చి తినమని మరీమరీ ప్రాధేయపడుతూ చెప్పారు మీ అక్కయ్యగారు...."

కాస్త మొగం చిట్లించాడు పాణి.

"రెండో ఫోను నీకోసం శారదా! మీ తమ్ముడు, అదే. ఊళ్లోనే ఉంటున్న నీ సొంత తమ్ముడు రవి మూర్ఛరోగాల నుంచి మంచంపట్టాడు. జ్వరం చాలా తీవ్రంగా వుందట. మీ నాన్న కూడా ఊళ్ళో లేరట. రాత్రికి సాయంగా రాగలవేమో అడుగుతున్నారు మీ అమ్మగారు...."

శారద మొగం తిప్పుకుంది.

బాత్రూమ్‌కి వెళ్ళి తలారా స్నానం చేసుకుంటున్న శర్మకి — తల మీద నీళ్ళు పడగానే ఒక ప్రశ్న మెదిలింది.

రక్తం పంచుకు పుట్టిన అక్కయ్యను పట్టించుకోడు పాణి. అక్కయ్యకాని అక్కయ్య చుట్టూ తిరుగుతున్నాడు. తప్పు లేదు.

రక్తం పంచుకు పుట్టిన తమ్ముడ్ని పట్టించుకోదు శారద. తమ్ముడుకాని తమ్ముడితో తిరుగుతోంది. తప్పులేదు!

అవి తప్పులు కానప్పుడు మరి సత్యం తప్పేమిటి? శారదను "చెల్లెమ్మా" అని పిలవకపోవడమా అతని తప్పు?

సత్యాన్ని ఎందుకు చంపేసింది శారద? తన బ్రతుకు గూర్చిన భయంతో అతని ప్రాణం తీసిందా? ఎక్కడో చదివిన వాక్యం శర్మకు గుర్తొచ్చింది.

"పాముకి కాటువేసే గుణం దుర్మార్గం కాదు ప్రాణభయం — భయపడే ఆరది కూడా పాముకన్నా ప్రమాదకరం — ఎంత పాలుపోసి పెంచినా, ఎప్పుడో కక్కుతుంది విషం."

### 5

తలనొప్పిగా వుందని శర్మ సినిమాకు రానన్నాడు.

తల నొప్పిగా ఉందనే శారద, చక్రపాణి సినిమాకు వెళ్ళారు. వెళ్తూవెళ్తూ ఫోను రిసీవరు తీసి పక్కన పడేసింది శారద.

రేపటికిఅన్నీ సర్దుకుంటాయనే నమ్మకం, అనుభవం ఉన్నాయి ఆమెకు!

వాళ్ళు వెళ్ళేసరికి కమలహాసన్ చిందులు వేస్తున్నాడు.

"నరుని బ్రతుకు నటన
ఈశ్వరుని తలపు ఘటన
ఈ రెంటి నట్టనడుమ
నీ కెందు కింత తపన?........"

గతవారం —

### సాహితీ క్విజ్ సమాధానాలు

1. శ్రీనాధుడు
2. రావూరు దొరస్వామి శర్మ
3. మాలపల్లి
4. శేషేంద్రశర్మ
5. రంగనాయకమ్మ
6. ఆరుద్ర
7. సంజీవదేవ్
8. పులిపంజా (పురిపండా కవిత్వం)
9. శ్రీపాద
10. "అర్పిత్ నాట్"